ఆ గాయం వెనుక, ఆ మచ్చ వెనక వున్న కసిని, వుద్రేకాన్ని అంచనా వేసుకుంటోంది సత్యం మనసు. లక్ష్మి అలా నవ్వటం, మెత్తగా జవాబు చెప్పటంతో సత్యం యింక సూటిగా లక్ష్మి వేపు చూళ్ళేక తల దించుకున్నాడు.

కుర్రాడు టీ తెచ్చి కౌంటర్ మీద పెట్టి వెళ్ళిపోయాడు..... టీ తాగుతుండగా లక్ష్మి సత్యం వేపు చూస్తూ.... "నీ బాధ నాకు తెలుసు..... ఎన్నాళ్ళిలా యాతనపడతావు చెప్పు.... ఎదురుగా అస్తమానం యివన్నీ చూస్తూ నీ వయసుని బిగబట్టుకుని ఎందుకీ బాధ..... మనం తప్పు వొప్పు అని ఆలోచించేలా వుందా బతుకు.... అందుకే తొందరగా అటో ఇటో తేల్చుకో....." అంది. అని కారా కిళ్ళీ కోసం వెళ్ళింది.

"అవును. లక్ష్మి అన్నట్టు ఎన్నాళ్ళిలా..... ఎటో అటు తేల్చుకోవాలి.... అయినా తప్పేముంది. తనొక్కడూ మడికట్టుక్కూచున్నంత మాత్రాన లక్ష్మి వాళ్ళ జీవితాలు మారిపోతాయా.... వాళ్ళకి మగాళ్ళ బాధ తప్పిపోతుందా.... తప్పేం వుంది... అందరిలాగే తనూ డబ్బిచ్చేస్తే సరి.... లక్ష్మి ఒంటివేపు, మరో సరస్వతి శరీరం వేపు పరిగెడుతున్నాయి సత్యం ఆలోచనలు. వున్నట్టుండి వులిక్కిపడ్డాడు.... అలా పరిగెడుతున్న ఆలోచనకి కొరడా దెబ్బ తగిలినట్టైంది.

'ఛ..... ఎంత దారుణం.... నిత్యం యిక్కడి దారిద్ర్యాన్ని చూస్తూ అందులోని నికృష్టాన్నీ, సంపాయించిన రూపాయలో పావలా ఐనా తిన్నగా వాళ్ళ కడుపుకి చేరని యీ ఆడ శరీరాల బానిసత్వాన్ని చూస్తూ..... దీనికన్నా అమానుషం ఇంకోటి లేదని మధనపడిన తనలో ఎంత మార్పు..... లక్ష్మితో సంపర్కం డబ్బిచ్చేస్తే సబబే అన్న స్థితికి తను దిగజారాడంటే....'. అసహనంగా లేచాడు సత్యం. ఆ హాలునంతా కలయచూశాడు..... బ్రోకర్ రాములు, రిక్షా జోగులు మెట్ల మీద కూచుని బ్రాకెట్ చార్టు చూస్తున్నారు. అప్పుడే లక్ష్మి, సరస్వతి కలిసి మెట్లెక్కుతున్నారు. తను ఎక్కడ్నించో ఎక్కడికో పడిపోతున్నట్టనిపించింది సత్యానికి. పిలిచి పలకరిస్తే చాలు జోగులు బూతుకబుర్లే చెపుతాడు.... కాస్సేపు దగ్గరుంటే చాలు రాములు ఏ ఆడది ఎలాటిదో చెప్పే డిక్షనరీలా వాగుతాడు. లక్ష్మి.... సరస్వతి అందరి పద్ధతీ తెలుసు. తనలోని ఆరాటానికి బాధకి వీళ్ళు ఆధారమని తెలుసు. అయినా వీళ్ళెవరి మీదా కోపంగా లేదు సత్యానికి. వాళ్ళందరి మీద యిష్టంగానే వుంది. ఆలోచనసాగిన కొద్దీ కోపమంతా ఆ లాడ్జి మీద, ఆ వాతావరణం మీద కలుగుతోంది. ఓ గంటసేపు మధనపడ్డాడు.

ఆ తర్వాత సత్యం ఆలోచన వో దారికి వచ్చేసింది. తనింకా అదే వాతావరణంలో వుండటం ఏ మాత్రం మంచిది కాదనుకున్నాడు.

★ ★ ★

తనలో తను తర్జన భర్జన పడ్డా చివరికి తండ్రికి చెప్పేశాడు. "లాడ్జిలో ఆ వుద్యోగం చెయ్యటం తనకిష్టం లేదని....." తండ్రితో అలా చెప్పేశాక పెద్ద బరువు తీరినట్టనిపించింది సత్యానికి.

సత్యం అన్నది వినగానే దెబ్బతిన్న పక్షిలా అయింది ఆయన ముఖం. ఓ క్షణానికి నెమ్మదిగా..... "ఏం..... ఏం జరిగిందీ.....!" అని అడిగారు.

"కొత్తగా ఏం జరగలేదు.... కానీ అక్కడ ఆ వాతావరణమే బాగోలేదు. తాగుడు, పేకాట.... ఆడాళ్ళ గొడవలు.... వీటిమధ్య నాకు ఏదోలా వుంది" అన్నాడు సత్యం.

ఆయన చాలాసేపు ఏం మాట్లాడలేదు. ఆయన మౌనం చూసి తను చెప్పిన విషయం తండ్రికి అర్థమైందని ఆనందించాడు సత్యం.

